క్లుప్తంగా

ఐక్యత ఫౌండేషన్ కార్యాలయం ప్రారంభం

వెల్దండ: పేదప్రజల సంక్షేమానికి ఐక్యత ఫౌండేషన్ అండగా ఉంటుందని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఐక్యత ఫౌండేషన్ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన ర్యాలీగా బయలుదేరి అంబేద్కర్ విగ్రహానికి పూలమాల సినివాళులర్పించారు. అనంతరం ఆయా గ్రామాలకు చెందిన వారు ఐక్యత చైర్మన్‌ను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఐక్యత ఫౌండేషన్ సభ్యులు వరప్రసాద్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, రమేష్‌నాయక్, కొండల్, మల్లయ్య, జగన్ ఉన్నారు.

స్పోర్ట్స్ దుస్తుల అందజేత

వెల్దండ: మండల పరిధిలోని గొల్లోనిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఉప్పల ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ దుస్తులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టసభ్యులు విజేష్, కృష్ణయ్య, నాగయ్య, వార్డు సభ్యులు యాదయ్య,ఉపాధ్యాయురాలు పావని తదితరులు ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించకుంటే చర్యలు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలోని ప్రజలందరూ వారి ఆస్తిపన్నులను సకాలంలో చెల్లించకుంటే చట్టం ప్రకారం చర్యలు ఉంటాయని మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్ కుమార్ హెచ్చరించారు. మంగళవారం పట్టణంలో పలు దుకాణాలను పరిశీలించి వాటి పన్నులు కట్టని దుకాణాలకు సిబ్బందితో తాళాలు వేయించారు. మున్సిపాలిటీ కార్యాలయంలో ప్రతి ఆదివారం, గురువారం రెవెన్యూ మేళా ఏర్పాటు చేశామని, ఫిర్యాదులు ఉంటే మేనేజర్ 8143414200ను సంప్రదించాలన్నారు. అలాగే కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని కమిషనర్ తెలిపారు.

నోట్ పుస్తకాల పంపిణీ

కొల్లాపూర్ రూరల్: మండల పరిధిలోని చౌటబెట్లలో ప్రాథమిక పాఠశాలలో గ్రామిక చైతన్య కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు మంగళవారం నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ చిన్నస్వామి మాట్లాడుతూ చదువుతో సమాజ వికాసం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా సీసీ రోడ్డు పనులు

పెద్దకొత్తపల్లి: మండలం పరిధిలోని జొన్నబొగుడతండాలో సీసీ రోడ్డు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ మేరకు ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి నిధులతో పాటు ఎన్‌ఆర్‌జీఎస్ నిధులు రూ.25 లక్షలతో పనులు చేపడుతున్నట్లు సర్పంచ్ ఇందిరా తెలిపారు.

సమస్యలపై చర్చ

బిజినేపల్లి: తిమ్మాజీపేట మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు, అధికారులు ఆయా సమస్యలపై చర్చించుకున్నారు. మంగళవారం ఉదయం ప్రారంభమైన ఈ సమావేశంలో విద్యుత్తు, వ్యవసాయ, ఆరోగ్య, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు తమ నివేదికలను చదివి వినిపించగా వాటిపై ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చర్చించారు. సమావేశంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ సందర్భంగా ఎలాంటి తీర్మాణాలు చేయలేదని ఎంపీపీ రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో ఎంపీడీఓ కరుణశ్రీ పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

కొల్లాపూర్: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని పతంజలి యోగా శిక్షకులు అలువాల అర్జున్‌గౌడ్ అన్నారు. మంగళవారం పట్టణంలోని మినీస్టేడియంలో యోగా ప్రాముఖ్యతను ఆయన వివరించారు. యోగా ఆసనాలు వేసి, వాటితో కలిగే ప్రయోజనాలను తెలియజేశారు. అనంతరం యోగా శిక్షణ పొందుతున్న వారికి డ్రెస్ కోడ్‌ను ఉచితంగా అందించేందుకు సీఐ జగదీశ్వర్ ముందుకొచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కు పంపిణీ

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్‌కి చెందిన గణేశ్ అనారోగ్యంతో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స తీసుకుంటున్నాడు. ఈ మేరకు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ గణేశ్ కుటుంబ సభ్యులకు మంగళవారం రూ.3.80లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. కార్యక్రమంలో తర్నికల్ గ్రామ రైతుబంధు అధ్యక్షుడు సురేశ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

చారకొండ: మండలంలోని బొమ్మల గుడిసెలకు చెందిన రాజు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి నిమ్స్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన రూ.లక్ష ఎల్‌ఓసీ పత్రాన్ని వారి కుటుంబసభ్యులకు ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు అసెంబ్లీలో తన కార్యాలయంలో అందజేశారు.

సమస్యలపై పోరాడాలి

కందనూలు: తెలంగాణ ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్టు ఫోరం పాత్ర కీలకమైందని, ఉద్యమ స్ఫూర్తితో సమస్యలపై పోరాడాలని టీయూడబ్ల్యూజేహెచ్–143 రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి అబ్దుల్లా ఖాన్ అన్నారు. మంగళవారం హిమాలయా కన్వెన్షన్ హాల్‌లో ఉమ్మడి జిల్లాలోని మహబూబ్ నగర్, నాగర్ కర్నూల్, గద్వాల, వనపర్తి, నారాయణపేట జిల్లాలో తన కార్యవర్గాలను ప్రకటించారు.

మాతృభాషపై పట్టు సాధించాలి



ఉప్పునుంతల బాలుర ప్రాథమిక పాఠశాలలో బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు



కల్వకుర్తిలో బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మైక్‌సెట్ అందజేస్తున్న క్లాస్‌మేట్ క్లబ్ సభ్యులు

ఉప్పునుంతల: మండల కేంద్రంలోని బాలుర ప్రాథమిక పాఠశాలతోపాటు కాంసానిపల్లి ప్రాథమిక పాఠశాల తదితర పాఠశాలల్లో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాసరచన, పద్యపఠన పోటీలు నిర్వహించి విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. మృతృభాషా గొప్పతనంపై ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. మాతృభాషపై విద్యార్థులు పట్టుసాధించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు లక్ష్మీనారాయణ, విజయకుమార్, ఉపాధ్యాయులు బాలమణి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల పరిధిలోని జటప్రోల్ జిల్లా పరిషత్ పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా మాతృభాషపై పట్టుతోనే ఇతర భాషలను అధ్యాయనం చేయవచ్చని చీమపూడి ఫౌండేషన్ సాహితి సంస్కృతిక సేవా సంస్థ జిల్లా సంచాలకులు వేదార్థం మధుసూదనశర్మ అన్నారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా మంగళవారం పలు పాఠశాలలో భగవద్గీత శ్లోకాలు, కంఠస్థ పోటీలు నిర్వహించి ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులు అందజేశారు. ప్రతి ఒక్కరు మాతృభాషను గౌరవించాలని తెలియజేశారు.

కల్వకుర్తి: పట్టణంలోని బాలికల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం రూ.20వేల విలువ చేసే మైక్‌సెట్‌ను బహూకరించారు. మాతృభాషా దినోత్సవం సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు పోటీలు నిర్వహించి బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా క్లాస్‌మేట్ క్లబ్ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ మాట్లాడుతూ 10వ తరగతి పరీక్షల్లో 10 జీపీఏ సాధించే విద్యార్థులకు నగదు పురస్కారం అందిస్తామన్నారు. అనంతరం రేవంత్, ప్రవీణ్‌ల సహకారంతో బహుమతులు అందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు నిర్మల, క్లబ్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనరసింహారావు, డివిజన్ అధ్యక్షుడు రాఘవేందర్, కోశాధికారి రాజేందర్, కార్యదర్శులు శ్రీధర్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి



తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

వెల్దండ: మండల కేంద్రంలో కబ్జాకు గురవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ ఆధ్వర్యంలో తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు కాపాడాలని కోరారు. మండల కేంద్రంలోని సర్వే నంబర్ 705లో ఉన్న భూములు కబ్జాకు గురవుతున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రమోహన్‌రెడ్డి, జోగయ్య, సింగల్‌విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్యగౌడ్, పట్టణ అధ్యక్షుడు ఎర్ర శ్రీనుముదిరాజ్, మధుసూదన్‌రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, తిరుపతిరెడ్డి, పురుషోత్తమచారి, నారాయణగౌడ్, పుల్లయ్య, భరత్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

బహుజన రాజ్య స్థాపనకు నడుంబిగిద్దాం

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్రంలో బహుజన రాజ్య స్థాపనకు కలిసికట్టుగా పనిచేసేందుకు నడుం బిగిద్దామని బీఎస్పీ జిల్లా నాయకులు కె.కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని పెద్దముద్దునూరులో పార్టీ ఆధ్వర్యంలో ధూంధాం కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే స్థానాన్ని ఈ పర్యాయం బహుజనులకు దక్కేలా బీఎస్పీ గెలుపు కోసం కృషి చేద్దామని అన్నారు. నియోజకవర్గంలో జెడ్పీటీసీ స్వగ్రామంలోనూ డబుల్‌బెడ్రూం పంపిణీ చేయలేదని ఆరోపించారు. అసెంబ్లీ అధ్యక్షుడు నాగార్జున, పృథ్వీరాజ్, మహేశ్ యాదవ్, కళ్యాణ్ పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మెన్ పోస్టుల్లో అవకాశం కల్పించాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో భర్తీ కానున్న విద్యుత్ లైన్‌మెన్ పోస్టుల భర్తీల్లో ఎలక్ట్రికల్ టెక్నికల్ ద్వితీయ సంవత్సరం స్టూడెంట్లకు అవకాశం కల్పించాలని బహుజన విద్యార్థి ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ ఏఓకు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మధు, నరేశ్,మోహన్, శ్రీకాంత్‌గౌడ్, అశోక్, కార్తీక్, శివ, సన్నీపాల్గొన్నారు.



వినతిపత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

విద్యార్థులకు టాలెంట్ టెస్టు

కోడేరు: మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో 6 నుంచి 10వ తరగతి విద్యార్థులకు మండల స్థాయి సైన్స్ టాలెంట్ టెస్టు నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు హెచ్‌ఎం కృష్ణయ్య తెలిపారు. కార్యక్రమంలో జగదీశ్వర్‌రెడ్డి, వెంకటేష్ పాల్గొన్నారు.

లింగాల: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ప్రతిభ పరీక్షలు దోహదపడుతాయని ఎంఈఓ చంద్రుడు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం మండల స్థాయి సైన్స్ టాలెంట్ పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు శ్రీనివాసులు, వెంకట్‌రాజు, జంగయ్య, సుబ్బయ్య, గోపాల్, రజిత పాల్గొన్నారు.



లింగాలలో సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం



వెల్దండలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సంఘం నాయకులు

పెంట్లవెల్లి: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం బలపర్చిన అభ్యర్థి గుర్రం చెన్నకేశవరెడ్డిని గెలిపించాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్‌రావు మంగళవారం స్థానిక జెడ్పీ హెచ్‌ఎస్ బాలుర పాఠశాలలో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బలరాంకృష్ణారావు, అర్జున్‌గౌడ్, జగన్మోహన్, రాంచందర్ తదితరులు పాల్గొన్నారు.

తెలకపల్లి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలతో పాటు రాకొండలోని కస్తూర్బా పాఠశాల, సీఎల్‌ఆర్ జూనియర్ కళాశాల, కార్వంగ ఉన్నత పాఠశాల, గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల, తెలకపల్లి గురుకుల పాఠశాలలో మంగళవారం పీఆర్‌టీయూ మండల శాఖ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారంలో పీఆర్‌టీయూ బలపరిచిన అభ్యర్థి గుర్రం చెన్నకేశవ రెడ్డి పాల్గొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు మేడిపూర్ మల్లిఖార్జున్, రాష్ట్ర బాధ్యులు శివప్రసాద్, నాయకులు బాలస్వామి, చంద్రశేఖర్, సాదిక్, అరవిందు, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.


వెల్దండ: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్సీ అభ్యర్థి మాణిక్‌రెడ్డిని గెలించాలని యూటీఎఫ్ మండల అధ్యక్షుడు నాగభూషణం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని రాచూర్, కొట్ర, పోతేపల్లి, బొల్లంపల్లి తదితర పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. అనంతరం కరపత్రాలను పంపిణీ చేశారు. చిన్నయ్య, జిల్లా కోశాధికారి బాలరాజ్, మండల ప్రధాన కార్యదర్శి రవినాయక్, వెంకటేశ్వర్లు, వెంకటయ్య, నెహ్రూప్రసాద్ తదితరులు ఉన్నారు.

ఆర్టీసీ అద్దె బస్సుల సర్వీసుల నిలిపివేత

కొల్లాపూర్: స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన అద్దెబస్సుల డ్రైవర్లు మంగళవారం విధులను బహిష్కరించి అద్దెబస్సుల రవాణా సేవలను నిలిపివేశారు. డిపోలో అద్దె ప్రాతిపదికన నడుపుతున్న ఓ బస్సు సోమవారం పెబ్బేరు నుంచి కొల్లాపూర్‌కు వస్తుండగా చిన్నంబావిలో డ్రైవర్ రాజశేఖర్‌కు ఓ పాత్రికేయుడికి మధ్య గొడవ జరిగింది. ఈ గొడవలో డ్రైవర్‌పై పాత్రికేయుడు దాడికి పాల్పడ్డాడనే కారణంతో అద్దెబస్సుల డ్రైవర్లు మంగళవారం విధులు బహిష్కరించారు. అనంతరం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఆందోళన చేపట్టారు. డీఎం రాజేశ్వర్ వారితో మాట్లాడి ఆందోళన విరమింపజేయించారు.

దాడి ఘటనపై డిప్యూటీ ఆర్‌ఎం విచారణ

స్థానిక ఆర్టీసీ డిపోకు చెందిన అద్దెబస్సు డ్రైవర్ రాజశేఖర్‌పై జరిగిన దాడి ఘటనపై ఉమ్మడి జిల్లా డిప్యూటీ ఆర్‌ఎం సత్యనారాయణ విచారణ చేపట్టారు. మంగళవారం ఆయన కొల్లాపూర్‌లో విధులు బహిష్కరించిన అద్దెబస్సు డ్రైవర్లను కలిశారు. దాడికి గురయిన రాజశేఖర్‌ను పరామర్శించి ఘటనకు సంబంధించిన వివరాలు తెలుసుకున్నారు. డిపోమేనేజర్ రాజేశ్వర్‌తో కలిసి చిన్నంబావి పోలీసుస్టేషన్‌కు వెళ్లి దాడికి పాల్పడిన వ్యక్తిపై ఫిర్యాదు చేశారు. డ్రైవర్‌కు ఆర్టీసీ డిపార్ట్‌మెంట్ అండగా ఉంటుందని హామీ ఇవ్వడంతో బస్సుల రాకపోకలు ప్రారంభించారు.



డ్రైవర్లతో డీఆర్‌ఎం సత్యనారాయణ

సారా విక్రయిస్తే చర్యలు

అచ్చంపేట రూరల్: సారా విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ కృష్ణ హెచ్చరించారు. మంగళవారం అచ్చంపేట శివారులో వాహనాలు తనిఖీ చేస్తుండగా బైక్‌పై సారా తరలిస్తున్న ఓ వ్యక్తిని పట్టుకున్నారు. గోపాల్‌నగర్ తండాకు చెందిన శక్రుగా గుర్తించి 12.5లీటర్ల సారాను పట్టుకొని తహసీల్దార్ కృష్ణయ్య ఎదుట బైండోవర్ చేశారు. రూ. 50వేల జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు బాలరాజు, సతీష్‌కుమార్, సిబ్బంది పరమేష్ తదితరులు పాల్గొన్నారు.

కంటోనిపల్లిలో చోరీ

వెల్దండ: మండల పరిధిలోని కంటోనిపల్లికి చెందిన రైతు కమటం సురేందర్‌కు చెందిన రెండు మేకలు, ఐదు కోళ్లను ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజువారిగా సోమవారం సాయంత్రం మేకలను, కోళ్లను వ్యవసాయ పొలంలోని షెడ్‌లో కట్టేసి వెళ్లారు. మంళవారం పొలానికి వెళ్లి చూడగా షెడ్‌కు ఉన్న కంటెను తొలగించి అందులో ఉన్న రెండు మేకలు, ఐదు కోళ్లు చోరికి గురైనట్లు పేర్కొన్నారు. ఈ విషయం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతు పేర్కొన్నారు. దాదాపుగా వాటి విలువ రూ.40వేల వరకు ఉంటుందన్నారు.

దాడులను అరికట్టాలి

కొల్లాపూర్: ప్రతిపక్ష పార్టీల నాయకులపై అధికార పార్టీ చేస్తున్న దాడులను అరికట్టాలని కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాముయాదవ్ డిమాండ్ చేశారు. వరంగల్‌లో యూత్‌కాంగ్రెస్ నాయకుడు పవన్‌పై బీఆర్‌ఎస్ నాయకులు దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. దాడి ఘటనను నిరసిస్తూ మంగళవారం స్థానిక ఎన్టీఆర్ చౌరస్తాలో కాంగ్రెస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. అనంతరం ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పరశురామ్ నాయుడు, నాయకులు ఉదయ్‌కుమార్, రసూల్, కాటం మౌలాలి, కురుమూర్తి, కృపాకల్‌లున్నారు.

ఎదురెదురుగా వాహనాలు ఢీ

లింగాల: మండల పరిధిలోని చెన్నంపల్లి సమీపంలో మంగళవారం రెండు వాహనాలు ఢీకొన్నాయి. వివరాల ప్రకారం.. పద్మన్నపల్లి నుంచి లింగాల వస్తున్న కారు, లింగాల నుంచి పత్తి సేకరణకు చెన్నంపల్లి వెళ్తున్న టాటా ఏసీ వాహనాలు బలంగా ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో కారు డ్రైవర్, పత్తి సేకరణకు వెళ్తున్న కూలీలు స్వల్ప గాయాలతో ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డారు. అయితే వాహనాల ముందు బాగాలు పాక్షికంగా దెబ్బతిన్నాయన్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ఉప్పునుంతల: మండలంలోని మామిళ్లపల్లిలో మంగళవారం ఉదయం వ్యవసాయ పొలం వద్ద దుడ్డు చంద్రయ్యపై అతని దాయాదైన దుడ్డు సాయిబాబు దాడిచేసి గాయపర్చడంతో బాధితుడి కుమారుడు దుడ్డు శ్రీశైలం ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్‌గౌడ్ తెలిపారు. పొలం గెట్టుకు సంబంధించిన పాత కక్షలు మనస్సులో పెట్టుకొని మాకు సంబంధించిన గేదె తన పొలంలోకి దాటిందనే నెపంతో గాయపర్చినట్లు ఫిర్యాదులో పేర్కొనట్లు ఎస్‌ఐ తెలిపారు.

కార్పొరేషన్ విశ్రాంత ఉద్యోగులకు ఊరట

మన్ననూర్: రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్లలో విధులు నిర్వహించి పదవి విరమణ పొందిన విశ్రాంత ఉద్యోగులకు సుప్రీంకోర్టు ఎట్టకేలకు ఊరటను కల్పించే ప్రకటన చేసిందని జీసీసీ విశ్రాంత ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

తాడూరు: బీజేపీతోనే రాష్ట్రంలో అభివృద్ధి సాధ్యమవుతుందని నియోజకవర్గ ఇన్‌చార్జ్ కొండా నాగేశ్ అన్నారు. ప్రజా గోస–బీజేపీ భరోసా యాత్ర కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని ఇంద్రకల్‌లో ఇంటింటి తిరిగి బీజేపీ చేపట్టే కార్యక్రమాలను ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రశ్నించే వారిపై అక్రమ కేసులు బనాయిస్తూ పోలీసులతో అరాచక పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు లోహిత్‌రెడ్డి, ఆంజనేయులు, శ్యాంసుందర్, నరేశ్ పాల్గొన్నారు.

రాష్ట్రంలో నిరంకుశ పాలన: కాంగ్రెస్



ఆర్సీతండాలో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

బిజినేపల్లి: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ నిరంకుశ పాలన సాగిస్తున్నారని మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డి అన్నారు. మంగళవారం తిమ్మాజీపేట మండలంలోని ఆర్సీతండాలో హాథ్ సే హాథ్ జోడో యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అభివృద్ధిపై ప్రశ్నిస్తే వారిపై వేధింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అర్థం రవి, నాగం శశిధర్‌రెడ్డి, లక్ష్మయ్య, మల్లయ్యగౌడ్ పాల్గొన్నారు.

వెల్దండ: పేదప్రజలకు అండగా కాంగ్రెస్ ఉంటుందని బ్లాక్‌కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి, మండల అధ్యక్షుడు మోతిలాల్‌నాయక్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని కొట్రలో హాథ్ సే హాథ్ జోడో నిర్వహించారు.

కొల్లాపూర్ రూరల్: వచ్చే ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ని బొందపెడితేనే ప్రజల సమస్యలు పరిష్కారమవుతాయని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అభిలాష్ రావు అన్నారు. మంగళవారం కుడికిల్లలో హాథ్ సే హాథ్ జోడో అభియాన్ నిర్వహించారు.

సామాజిక సేవలో 'లయన్స్‌క్లబ్' ప్రత్యేక పాత్ర



అన్నదానం చేస్తున్న రమేశ్‌బాబు

కల్వకుర్తిరూరల్: సామాజిక సేవాకార్యక్రమాలు చేపట్టే సంస్థల్లో లయన్స్ క్లబ్‌లది ప్రత్యేక పాత్ర అని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ జూలూరి రమేశ్ బాబు అన్నారు. మంగళవారం పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో కల్వకుర్తి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. క్లబ్ కల్వకుర్తి అధ్యక్షుడు కల్మిచర్ల రమేశ్, క్లబ్ కార్యదర్శి శ్రీధర్, కోశాధికారి వెంకటేశ్, జాయింట్ సెక్రెట్రీ శ్రీనివాస్‌రెడ్డి, దాత గార్లపాటి శ్రీనివాస్, కిషన్, శ్రీనివాస్, కృష్ణయ్య, శేఖర్, ప్రకాశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కొల్లాపూర్ రూరల్: ప్రజా సమస్యలు పరిష్కరించడంలో అలసత్వం వద్దని ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి అధికారులను హెచ్చరించారు. మంగళవారం మండల పరిధిలోని చుకాయపల్లిలో ఆయన మీ కోసం–మీ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉందని ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే అధికారులు వెంటనే సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు.

బకాయిలపై సమావేశాలు



మాట్లాడుతున్న మోహన్

లింగాల: మండలంలోని అంబట్‌పల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో పేరుకుపోయిన బకాయిల వసూళ్లకు చైర్మన్ హన్మంత్‌రెడ్డి సూచనల మేరకు పాలక వర్గం, డీసీసీబీ అచ్చంపేట బ్రాంచ్ అధికారులు గ్రామ గ్రామాన అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని చెన్నంపల్లి గ్రామ పంచాయతీ ఆవరణలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అచ్చంపేట బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ మోహన్ మాట్లాడుతూ పీఏసీఎస్‌కు రైతుల నుంచి రూ.3.40 కోట్ల మేరకు బకాయిలు రావాల్సి ఉందని తెలిపారు. బకాయిలు ఉన్న చెన్నంపల్లికి చెందిన రైతులు ముందుకొచ్చి రుణాల రికవరికి సహకరించాలని ఫీల్డ్ ఆఫీసర్ కోరారు. సర్పంచ్ రవీందర్, సీఈఓ పాండు, రైతులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేక్‌లు ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్‌రూరల్: నాగర్‌కర్నూల్ నుంచి కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారిలోని దేశిటిక్యాల వద్ద బ్రేక్ కట్టలు ఏర్పాటు చేయాలని సీపీఎం మండల కార్యదర్శి జి.అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ డీఈకి వినతి పత్రం ఇవ్వడానికి వెళ్లిన సీపీఎం బృందానికి కార్యాలయం తాళం వేసి ఉండడంతో తలుపులకు వినతి పత్రం సమర్పించారు. గత కొద్ది రోజులుగా ఎప్పుడు వెళ్లినా కార్యాలయంలో అధికారులు ఎవ్వరూ ఉండడం లేదని ఆరోపించారు. కొల్లాపూర్ వెళ్లే ప్రధాన రహదారి వాహనాల రద్దీ అధికంగా ఉండడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, రోడ్డు ప్రమాదాల్లో చాలామంది ప్రాణాలు కోల్పోయారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కమిటీ సభ్యులు శివకుమార్, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'కంటి వెలుగు'

కల్వకుర్తిరూరల్: మండల పరిధిలో మంగళవారం మూడు శిబిరాలలో రఘుపతిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో 621 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు 36 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు.

తాడూరు: మండలంలోని మేడిపూర్‌లో వారం రోజులుగా నిర్వహించిన కంటి వెలుగు కార్యక్రమం మంగళవారం ముగిసినట్లు వైద్యాధికారి డాక్టర్ ఎండీ ఇస్మాయిల్ తెలిపారు. బుధవారం మండలంలోని ఇంద్రకల్‌లో కంటి వెలుగు పరీక్షా కేంద్రాన్ని ప్రారంభిస్తామన్నారు. వారం రోజుల పాటు 1,081 మందిని పరీక్షించామన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది శ్రీనివాసులు, రమాదేవి, శారద, పారిజాత, సారమ్మ, రాజేశ్వరి పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల పరిశీలన



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న రాష్ట్ర పర్యవేక్షక బృందం సభ్యులు సతీష్‌కుమార్

ఉప్పునుంతల: మండలంలోని కాంసానిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదో తరగతి చదువుతున్న విద్యార్థుల సామర్థ్యాలను రాష్ట్ర పర్యావేక్షక బృందం సభ్యులు సతీష్ కుమార్ పరిశీలించారు. సబ్జెక్టుల వారిగా విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించిన ఆయన మరింతగా మెరుగు పడాల్సిన అవసరముందని చెప్పారు. మాదిరిటువంటి ప్రశ్నా పత్రాలపైన విద్యార్థుల అవగాహనను పరిశీలించి బ్లూ ప్రింట్ ప్రకారం విద్యార్థులకు ప్రశ్నల వారిగా అభ్యాసం చేయించాలని ఉపాధ్యాయులకు సూచించారు. సీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని కార్యచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని ఆయన చెప్పారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని ప్రైవేట్ ఆస్పత్రుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా వసూలు చేస్తూ దోపిడికి తెరతీశారని, ప్రైవేట్ ఆస్పత్రుల మాఫియాపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్ రెడ్డి, యువజన కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు అనిల్ గౌడ్‌లు మాట్లాడుతూ కల్వకుర్తిలో ప్రైవేట్ ఆస్పత్రులు మాఫియాగా మారాయని ఆరోపించారు. ఆస్పత్రుల దోపిడిపై జిల్లా వైద్య శాఖ అధికారికి ఫిర్యాదు చేద్దామంటే ఎప్పుడూ స్పందించరని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, బాలరాజు, జంగయ్యగౌడ్, శేఖర్, దామోదర్‌రెడ్డి, శాకీర్, వంశీ, రమేశ్, దాస్యనాయక్, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.